
సాక్షి ఒడిశా

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,16,446
బంగారం: 2 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
వెండి: 17 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



ఉల్లంఘన తగదు

పూరీ ఆలయ నిర్వహణలో ఆచారాలు పాటించాలని మహారాజు అన్నారు. ఉల్లంఘన తగదని తెలిపారు. - 8లో



17న మెగా ప్లాంటేషన్

పర్లాకిమిడిలో 17న మెగా ప్లాంటేషన్ జరగనుంది. ఏర్పాట్లు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మోహన్ మృతదేహం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. జిల్లాలోని రామనగుడలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో గజపతి జిల్లాకు చెందిన కొరాయి మోహన్ (40) మృత్యువాత పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. తన అత్తవారింటికి బైక్‌పై మోహన్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో మోహన్ తీవ్రగాయాలకు గురయ్యాడు. స్థానికులు రామనగుడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

పాముకాటుతో మహిళా సర్పంచ్ మృతి

రాయగడ: సదరు సమితి కూలి పంచాయతీ సర్పంచ్ మంగి కద్రక (32)పాముకాటుతో ప్రాణాలు కోల్పోయారు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి సమయంలో ఆమెకు విషపూరితమైన పాము కాటు వేసింది. దీంతో గ్రామస్తులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కాలువలో చిక్కుకున్న గున్న ఏనుగు



కాలువలో చిక్కుకున్న గున్న ఏనుగు

భువనేశ్వర్: గుంపులో తప్పిన గున్న ఏనుగు కాలువలోకి జారింది. బయటకు రాలేక కొన్ని గంటల పాటు తంటాలు పడింది. అటవీ శాఖ అధికారుల తేలికపాటి చర్యలతో గున్న ఏనుగు సురక్షితంగా గట్టెక్కింది. ఆదివారం ఢెంకనాల్ సదర్ రేంజ్ హలాదియాబహల్ సమీపంలోని రెంగాలి కాలువలోకి గున్న ఏనుగు జారి పడింది. నీటి పోటుతో కొన్ని గంటలపాటు తల్లడిల్లింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలం చేరి కాలువలో చిక్కుకున్న గున్న ఏనుగు సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఏనుగు వయసు 5 ఏళ్లు ఉంటుందని అంచనా. సురక్షితంగా గట్టెక్కిన గున్న ఏనుగు చురుగ్గా హలదియాబహల్ సమీపంలోని అటవీ ప్రాంతం వైపు పరుగులు తీసింది.

వ్యక్తి ఆత్మహత్య



వాసుదేవ్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి ఎంపీవీ 66 గ్రామానికి చెందిన వాసుదేవ్ మిశ్రి (40) అనే వ్యక్తి శనివారం రాత్రి తన ఇంటిలో శ్లాబ్‌కు ఉన్న హుక్కుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో అంతవరకు అందరితో కలివిడిగా ఉన్న వ్యక్తి అర్ధరాత్రి ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు వాసుదేవ్ కనిపించకపోవడంతో గదిలోకి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

క్రికెట్ విజేతగా కలెక్టరేట్ జట్టు



ట్రోఫీతో డి.ఎం.గజపతి జట్టు

పర్లాకిమిడి: డి.ఎం.గజపతి (కలెక్టరేట్) టీమ్, బంధన్ బ్యాంకు టీమ్‌ల మధ్య బంధుత్వ క్రికెట్ మ్యాచ్ ఆదివారం ఉదయం స్థానిక శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాల మైదానంలో జరిగింది. ఈ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా అదనపు జిల్లా మాజిస్ట్రేట్ ఫల్గునీ మఝి, సబ్ కలెక్టర్ అనుప్ పండా విచ్చేశారు. తొలిత టాస్ గెలిచిన జిల్లా యంత్రాంగం జట్టులో సబ్ కలెక్టర్ అనుప్ పండా 27 రన్స్ చేశారు. మొత్తం 9 వికెట్లు కోల్పోయి 115 రన్స్ చేశారు. బరిలోకి దిగిన బంధన్ బ్యాంకు టీమ్ 106 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా క్రాంతి (29 పరుగులు)కి అందజేశారు. బంధన్ బ్యాంకు క్లస్టర్ హెడ్ స్థితప్రగ్య దాస్, బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ పాఢీ, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగౌరి అమ్మవారికి హారతి సమర్పించిన అనంతరం గర్భగుడికి తాళం వేస్తున్న పూజారులు



మూసివేసిన బాలాజీ నగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిరం

గ్రహణం ఎఫెక్ట్



మూసివేసిన మజ్జిగౌరి మందిరం ప్రధాన ద్వారం

• మూతబడిన ఆలయాలు

రాయగడ: చంద్ర గ్రహణం ప్రభావంతో ప్రముఖ మందిరాలతో పాటు అన్ని మందిరాలు ఆదివారం మూతపడ్డాయి. ఇందులో భాగంగా ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి మందిరాన్ని ఉదయం 11.10 గంటలకు మూసి వేశారు. అమ్మవారికి మధ్యాహ్నం అన్నభోగంతో పాటు హారతిని సమర్పించి అమ్మవారి గర్భగుడితో పాటు ప్రధాన ద్వారాలను మూసివేశారు. అయితే కొందరు భక్తుల దర్శనం కోసం వచ్చినప్పటికీ మందిరాన్ని మూసివేసిన కారణంగా ఆరుబయట నుంచి మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళ్లిపోవడం కనిపించింది. అలాగే స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిరం



మజ్జిగౌరి మందిరం వద్ద ఆరుబయట మొక్కులు తీర్చుకుని తిరిగి వెళుతున్న భక్తులు

పూజా కార్యక్రమాలను నిర్వహించిన ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు అనంతరం మందిరాన్ని మూసివేశారు. బ్రాహ్మణవీధిలోని కొదండరామ మందిరం, పీహెచ్‌డీ కాలనీ వద్ద గల



మూతపడిన కోదండరామ మందిరం

బాలింకేశ్వర ఆలయాలను కూడా మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్ష అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

గ్రహణం సమయంలో శ్రీ జగన్నాథుని విశేష దర్శనం



స్నాన వస్త్ర ధారణలో శ్రీ జగన్నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానంలో అడుగడుగునా విభిన్నత ప్రదర్శితం అవుతుంది. సాధారణంగా చంద్ర గ్రహణం లేదా సూర్య గ్రహణం సమయంలో దేవస్థానాలు మూసివేస్తారు. శ్రీ జగన్నాథుడు కొలువుదీరిన శ్రీ మందిరం మాత్రం తెరిచే ఉంటుంది. గ్రహణ సమయంలో దర్శనం విశేషంగా పరిగణిస్తారు. గ్రహణ స్పర్శకు ముందుగా పంచాంగం గణాంకాల ప్రకారం పండితుల నిర్ధారణ మేరకు నివేదనలు నివారిస్తారు. తదనుగుణంగా నిత్య సేవలు, పూజాదులు నిలిపి వేస్తారు. గ్రహణ స్పర్శకు ముందుగా రత్న వేదికపై మూల విరాటులకు స్నాన వస్త్రధారణతో తీర్చిదిద్దుతారు. గ్రహణ సమయంలో ఆద్యంతం దర్శనం నిరవధికంగా దొరుకుతుంది. గ్రహణం పట్టు ఘడియల్లో శ్రీ మందిరంలో విశేష సేవలు ప్రారంభిస్తారు. ఈ సమయంలో భక్తులకు అత్యంత చేరువలో లోపలి ప్రాంగణం నుంచి నిరవధిక దర్శనం అవకాశం ఉంటుంది. స్నాన వస్త్ర ధారణలో స్వామి దర్శనం ప్రాప్తిస్తుంది.

నేటి నుంచి కొరాపుట్‌లో గవర్నర్ పర్యటన



రాష్ట్ర గవర్నర్ హరిబాబు

కొరాపుట్: గవర్నర్ కె.హరిబాబు సోమవారం నుంచి కొరాపుట్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆకస్మికంగా ఖరారైన పర్యటన సుదీర్ఘంగా జరగనుంది. సోమవారం ప్రత్యేక విమానంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి జయపూర్ రానున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కాఫీ బోర్డుని సందర్శిస్తారు. అనంతరం సర్క్యూట్ హౌస్‌లో ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల, భారత అల్యూమినియ కేంద్రం (నాల్కో), హిందుస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్, కోట్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతారు. అనంతరం శభరి శ్రీక్షేత్రం జగన్నాథ మందిరం దర్శిస్తారు. 9వ తేదీన సునాబెడా, సిమిలిగుడ, మిలిట్ మిషన్, ఏకలవ్య మోడల్ విద్యా కేంద్రంలను సందర్శిస్తారు. అదే రోజు ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం దేవ మాలిలో ప్రకృతి అందాలు తిలకిస్తారు. 10వ తేదీన మల్కన్‌గిరి జిల్లా పర్యటిస్తారు. తిరిగి 11వ తేదీ కొరాపుట్ జిల్లా కేంద్రంకి తిరిగి వచ్చి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు తిరిగి భువనేశ్వర్ వెళ్తారు. ఆలస్యంగా ఖరారైన పర్యటన నేపథ్యంలో భారీ వర్షంలో కూడా అధికారులు ఉరుకులు పరుగులతో ఏర్పాట్లు చేస్తున్నారు.

పిప్పిలి-కోణార్క్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌కు

ప్రభుత్వం అనుమతి

• ప్రయాణ సమయం కుదింపు



భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ శిల్ప కళాఖండం పర్యటన ప్రాంతం సందర్శనకు అనుకూలమైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తరచూ పలు ఆహ్లాదకరమైన పథకాలు, కార్యక్రమాల్ని ప్రవేశ పెడుతున్నారు. ప్రధానంగా పూరీ పరిసర ప్రాంతాల నుంచి కోణార్క్ ప్రాంతానికి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ఆకట్టుకునే ప్రయాణ మార్గాల అన్వేషణ విశేష ఆకర్షణగా నిలుస్తుంది. ఇప్పటికే ప్రాచుర్యం పొందిన పూరీ-కోణార్కు మెరైన్ డ్రైవ్‌కు అనుబంధంగా పూరీ సమీప పిప్పిలి ప్రాంతం నంచి కోణార్క్ శిల్ప కళాక్షేత్రానికి హరిత ప్రాకార రహదారి (గ్రీన్‌ఫీల్డ్ కారిడార్) నిర్మాణం యోచనకు ప్రాథమిక ఆమోదం లభించడం విశేషం. యోచన ప్రకారం పథకం వాస్తవ కార్యాచరణకు నోచుకుంటే పిప్పిలి, కోణార్క్ ప్రాంతాల మధ్య ఒక గంటన్నర (90 నిముషాలు) ప్రయాణం నామ మాత్రంగా అర గంట (30 నిముషాలు)కు పరిమితం అవుతుంది. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పూరీ జిల్లాలో రోడ్డు అనుసంధానంపై ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, నిర్మాణ విభాగం మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఈ ఆమోదం వెల్లడించారు. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ 40 కిలో మీటర్ల పొడవు, 200 అడుగుల వెడల్పుతో సువిశాలంగా 4 అంచెల ఎక్స్‌ప్రెస్‌వేగా అభివృద్ధి చేస్తారు. ఈ సుదూర బాటలో వాహనాలు గంటకు 100 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోయేందుకు అనుకూలంగా నిర్మితం చేయాలని ప్రతిపాదించారు. అందుకు అవసరమైన డిజైన్ పనులు ఊపందుకున్నాయి. అంచెలంచెలుగా ప్రాథమిక స్థాయి కార్యాచరణ పూర్తి కావడంతో అనుబంధ అనుమతులు పొందడంతో హరిత ప్రాకార రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రారంభం అవుతుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు.

సమీక్ష సమావేశంలో మరికొన్ని ప్రాజెక్టులపై చర్చించారు. పూరీ ప్రాంతంలో తాజ్ ఇంటర్నేషనల్ నుండి జగన్నాథ్ స్టేడియం వరకు ఉన్న రహదారిని 4 అంచెలుగా విస్తరించనున్నారు. చైతన్య రోడ్డు నుంచి బలిసాహి (జగన్నాథ్ ఆలయానికి అనుసంధాన బాట), డోలమండపం వీధి రోడ్డు మరియు ఝుడేశ్వరి క్లబ్, మెడికల్ ఛక్ మార్గం అనుసంధానం సర్వే ప్రక్రియకు ప్రణాళిక ఖరారు చేశారు. నిమాపడా నియోజక వర్గంలో చారి ఛొక్కా నుండి అస్తరంగ్ వరకు 4 లేన్ల రహదారికి మరియు జలార్ పూర్ మరియు చారి ఛొక్కా కలిపే మరొక రహదారికి ప్రణాళికలు ఖరారు చేశారు. ఈ ప్రాజెక్టులు పూరీ జిల్లా అంతటా రహదారి అనుసంధానం గణనీయంగా పెంచుతాయని, పర్యాటకం, స్థానిక అభివృద్ధి రెండింటినీ పెంచుతాయని అధికారులు తెలిపారు.

నవీన్ పట్నాయక్ ఢిల్లీ పర్యటన

• రాజకీయ ఊహాగానాలు



విమానాశ్రయంలో నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బిజు జనతాదళ్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. 4 రోజుల పర్యటనకు వెళ్లినట్లు బిజూ జనతా దళ్ వర్గాల సమాచారం. నవీన్ పట్నాయక్ ఢిల్లీ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో బీజేడీ వైఖరి పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఉప రాష్ట్రపతి ఎన్నికలో బిజూ జనతా దళ్ అభిప్రాయం ఇంత వరకు బయటకు పొక్కలేదు. అంతిమ క్షణం వరకు కీలక అంశాలపై బీజేడీ అధినేత నిర్ణయం అత్యంత గోప్యంగా కొనసాగుతుంది. ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో బిజూ జనతా దళ్ జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్డీయే పక్షాన లేదా విపక్ష కూటమి పక్షాన ఉంటుందోననే ఉత్కంఠ బిగుసుకుని ఉంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు పురస్కరించుకుని గతంలో బిజూ జనతా దళ్ పలు సందర్భాల్లో విభిన్న రీతుల్లో స్పందించింది. కొన్ని సందర్భాల్లో ఎన్నికకు దూరంగా ఉన్న దాఖలాలు లేకపోలేదు. తాజాగా జరుగుతున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలో బిజూ జనతా దళ్ అత్యంత వ్యూహాత్మకంగా ఖరారు కానుందని ప్రముఖుల అభిప్రాయం.

రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

ఢిల్లీకి బయల్దేరే ముందుగా నవీన్ పట్నాయక్ బీజేడీ రాజకీయ వ్యవహారాల కమిటీతో సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ స్పందిస్తూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడంలో బిజూ జనతా దళ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపి ప్రతి ఇంటి ముంగిటకు ప్రభుత్వ పాలన పోకడని చేరదీస్తుందన్నారు. ఈ దిశలో రాజకీయ వ్యవహారాల సమావేశం కొనసాగిందన్నారు. దీర్ఘ కాలం తర్వాత నవీన్ పట్నాయక్ రాజకీయ వ్యవహారాల్లో ప్రత్యక్షంగా తారసపడ్డారు. ఇటీవల ఆయన అనారోగ్యం కారణంగా విరామంలో కొనసాగారు. భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక అతి చేరువలో ఉంది. మరో వైపు శాసన సభ వానా కాలం సమావేశాలు దగ్గరపడుతున్నాయి. ఈ సందర్భాల్లో విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ వైఖరికి సాన పెట్టే వ్యూహంతో రాజకీయ వ్యవహారాల సమావేశం జరిగిందని రాజకీయ శిబిరాల్లో చర్చ చోటు చేసుకుంటుంది. రాబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో, పీఏసీ సభ్యులు పార్టీ అధ్యక్షుడితో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నవీన్ పట్నాయక్ తగిన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటారు. బీజేడీ ఇటీవల విద్యార్థి, యువత, మహిళా విభాగాలను పునరుద్ధరించింది. ఆయా వర్గాల మధ్య సమన్వయం, వర్ధమాన రాజకీయ, సామాజిక స్థితిగతుల దృష్ట్యా కార్యశైలిని ఈ సమావేశంలో ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుమారు 10 రోజుల్లో ప్రారంభం కానున్న రాష్ట్ర శాసన సభ వానాకాలం సమావేశంలో లేవనెత్తాల్సిన కీలక అంశాలపై కూడా సభ్యులు చర్చించారు. మహిళలు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దౌర్జన్యాలు, ఎరువుల కొరత, రథ యాత్ర సమయంలో నిర్వహణ లోపాలు వంటి కీలక అంశాల్ని సభలో ప్రస్తావించేందుకు బీజేడీ సిద్ధం అవుతోంది.

ట్రక్ ఓనర్స్ సంఘం ఉపాధ్యక్షుడిగా మహంతి



నామినేషన్ పత్రం అందజేస్తున్న నొరి మహంతి

కొరాపుట్:

ఒడిశా ట్రక్ ఓనర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా జయపూర్ మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి (నొరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బ్రహ్మపుర పట్టణంలో గంజాం ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొరాపుట్ జిల్లా నుంచి లారీ యజమానులు తరలివెళ్లారు. రాష్ట్ర కార్యవర్గంలో వివిధ పదవులకు పలువురు తలపడడంతో పోలింగ్ అనివార్యమైంది. ఉపాధ్యక్ష పదవికి మాత్రం నొరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లుగా జయపూర్ లారీ ఓనర్స్ అసోసియేషన్‌కి నొరి మహంతి సెక్రటరీగా కొనసాగుతున్నారు.

డీజే శబ్దాలకు ఇద్దరు బలి



సూరజ్ ఖొర (ఫైల్)



లాడి వేణుగోపాల్ మృతదేహం

రాయగడ: రాయగడలో డీజే శబ్దాలకు ఇద్దరు మృతి చెందారు. స్థానిక రామకృష్ణ నగర్‌లో పోస్టాఫీస్ కాలనీకి చెందిన చంద్ర ఖొర కొడుకు సూరజ్ ఖొర (28), అదేవిధంగా జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి మజ్జిగుడ గ్రామానికి చెందిన లాడి వేణుగోపాల్ (43) లు గత 24 గంటల వ్యవధిలో గుండెపోటుతో మృతి చెందిన సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే .. శుక్రవారం నాడు స్థానిక రామకృష్ణ నగర్‌లో వినాయక నిమజ్జనాలు చేపట్టారు. ఇందులో భాగంగా డీజే సౌండ్ సిస్టమ్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. నిమజ్జనం చేసే సమయంలో నృత్యాలు చేసి వెళ్తున్న సమయంలో డ్యాన్స్ చేస్తున్న సూరజ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీజే సౌండ్ వల్ల అతడు గుండెపోటుకు గురైనట్లు భావిస్తున్నారు. అదేవిధంగా శనివారం నాడు కల్యాణసింగుపూర్ సమితి పూజారిగుడలో కూడా అదే తరహా వినాయక నిమజ్జనం సమయంలో డీజే సౌండ్ కారణంగా వేణుగోపాల్ మృతి చెందినట్లు సమాచారం.

చెట్టుని ఢీకొన్న బైక్ : ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన రామ కమార్, భద్ర కమార్



ప్రమాదంలో 30 అడుగుల దూరంలో పడిన బైక్

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి టొపాజొడి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ఒక బైక్ చెట్టుకు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు గాయపడ్డారు. బొయిపరిగుడ సమితి చంద్రపడ పంచాయతీ భెజాగుడ గ్రామం రామ కమార్(37), భద్ర కమార్(35)లు కలిసి ఇనుప సామాన్లు అమ్మేందుకు శనివారం బొయిపరిగుడ సమితి కాతపాడ వార సంతకు బైక్‌పై వెళ్లారు. సంత అయ్యాక సాయంత్రం వస్తుండగా మార్గంలో టొపాజొడి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి ఒక చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు తుళ్లి దూరంగా పడ్డారు. బైక్ 30 అడుగుల దూరంలో పడింది. ప్రమాద సమాచారం తెలిసిన టంగిణగుడ గ్రామ స్వచ్ఛంద సేవకులు వెంటనే సంఘటనస్థలానికి చేరుకుని గాయపడిన వారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి చేర్చారు. ప్రమాదంలో రామ కమార్‌కు కుడి చేయి విరిగిందని, అలాగే తలపై దెబ్బలు తగిలాయని తెలిపారు. అనంతరం అతడిని జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

కాలినడకన ఎమ్మెల్యే పర్యటన

• పూజారిబంబు గ్రామం సందర్శన
• సమస్యలు పరిష్కరిస్తానని హామీ



పూజారిబంబు గ్రామానికి వెళ్లేందుకు నాగావళి నది దాటుతున్న ఎమ్మెల్యే కద్రక, అతని అనుచరులు

రాయగడ: సదరు సమితికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని పూజారిబంబు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక శనివారం పర్యటించారు. ఈ గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న నాగావళి నదిని దాటాల్సి ఉంటుంది. సరైన రహదారి లేకపోవడంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అతని వాహనాన్ని విడిచిపెట్టి కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. ఇక్కడ 80 కుటుంబాలు నివసిస్తున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలను గడుపుతున్నారు. అంతా ఆదివాసీలే. గ్రామానికి రహదారి లేకపోవడంతో పాటు నిత్యం అవసరాల కోసం పట్టణానికి చేరుకోవాలంటే మధ్యలో నదిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. అదే వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఈ గ్రామస్తులు ఉంటారు. నదీలో నీటి ప్రవాహం ఎక్కువైతే నదిని దాటని పరిస్థితి.

సమస్యలు నెలవు..

గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే వద్ద గ్రామస్తులు తమ గ్రామ సమస్యల గురించి ఏకరువు పెట్టారు. ఎన్నికల ముందే దర్శనం ఇచ్చే రాజకీయ నాయకులు ఎన్నికల అనంతరం వారి దర్శనభాగ్యమే కరువయ్యేదని అయితే ఎమ్మెల్యేగా ఎన్నికైన కద్రక తమ సమస్యల గురించి తెలుసుకోవడానికి గ్రామానికి రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పర్యటన అనంతరం ఎమ్మెల్యే కద్రక విలేకర్లతో మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటం విచారకరమన్నారు. అదీ కాకుండా సదరు సమితి కేంద్రానికి కేవలం ఎనిమిది కిల్లోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామ పరిస్థితి ఇలా ఉంటే అడవుల్లో, కొండకొనల్లో నివసించే వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఈ గ్రామంలో తరచూ పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

జయపురం: ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధికారులు ఆదివారం వెల్లడించారు. జాతీయ న్యాయ సేవా ప్రదీకరణ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల ఆదేశం మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. జయపురంతోపాటు కొరాపుట్, కొట్‌పాడ్, బొరిగుమ్మ, సెమిలిగుడ, దసమంతపూర్, లమతాపుట్, లక్ష్మీపూర్‌లలో ఉన్న అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లోక్‌అదాలత్‌లలో సివిల్, క్రిమినల్, మోటారు ప్రమాదాల పరిహారాలు, బ్యాంక్ రుణాలు, విద్యుత్, భూవివాదాలు, కుటుంబ సమస్యలు, కార్మికులకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్, రెవెన్యూ సంబంధిత కేసులు పరిష్కరించుకోవాలన్నారు.

ప్రైవేటు బస్సు యజమానుల సంఘం కార్యదర్శి వెంకటరావు మృతి


వెంకటరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నెక్కంటి


కట్టా వెంకటరావు (ఫైల్)

రాయగడ: రాయగడ ప్రైవేట్ బస్సుల యజమానుల సంఘం వ్యవస్థాపకులు, కార్యదర్శి కట్టా వెంకటరావు (84) ఆదివారం ఉదయం కన్నుమూశారు. కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైన అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే చికిత్సావస్థలోనే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. 35 ఏళ్లుగా ప్రైవేట్ బస్సుల యజమానుల సంఘం కార్యదర్శిగా విధులు నిర్వస్తూ పలు సేవలు అందించారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబీకులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, రాయగడ ఎంఎల్ఏ అప్పల స్వామి కద్రక తదితర ప్రముఖులు వెంకటరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

ఆలయాల మూసివేత


రాజవీధిలో మూతబడిన రామలింగేశ్వర మందిరం

పర్లాకిమిడి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా పర్లాకిమిడిలో అన్ని శైవ, విష్ణు, వేంకటేశ్వర, పార్వతి, తదితర ఆలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ జరిపి తెరుస్తామని అర్చకులు తెలియజేశారు.

హౌసింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట: జిల్లాలో పనిచేస్తున్న ఏపీ గృహనిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (జేఏసీ) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించినట్లు నరసన్నపేట ఏఈ, ఏఈల సంఘ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా గొల్లంగి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొల్లంగి యువరాజు, సబ్ డివిజన్ జనరల్ కార్యదర్శిగా కీర్తి అప్పలనాయుడు, ట్రెజరర్‌గా సారి సంతోష్‌లను ఎన్నుకున్నారు. మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూనియన్‌లో గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఎంఐసీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈఓలు భాగస్వాములుగా ఉంటారని పేర్కొన్నారు.

డీజే నిషేధిస్తూ తీర్మానం

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది పంచాయతీ కె.కపాసుకుద్దిలో డీజే సౌండ్ సిస్టం నిషేదిస్తూ గ్రామాభివృద్ధి కమిటీ ఆదివారం తీర్మానం చేసింది. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎటువంటి సందర్భంలోనూ గ్రామంలో డీజే పెట్టడానికి వీలులేదని, తీర్మానాన్ని ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

ఐతమ్‌కు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో 201 నుంచి 300 బాండ్ ర్యాంకింగ్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి విభజించిన ర్యాంకుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వచ్చిన మూడు కళాశాలలో ఐతమ్ కళాశాల స్థానం దక్కినట్లు వెల్లడించారు.

గ్రంథాలు, సంప్రదాయాల ఉల్లంఘన తగదు

- పూరీ గజపతి మహారాజా


మాట్లాడుతున్న పూరీ గజపతి మహారాజా

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని సంస్కృతి ఆచరణలో కృష్ణచైతన్య అంతర్జాతీయ సంఘం (ఇస్కాన్) గ్రంథాలు, సంప్రదాయాల ఉల్లంఘనకు పాల్పడుతోందని పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రముఖ పండితులు జగన్నాథ స్వామి ఉత్సవాలను ప్రపంచవ్యాప్తంగా ఆచరించడానికి సంబంధించిన గ్రంథ మార్గదర్శకాలపై తమ తుది అభిప్రాయాన్ని తెలియజేశారు. జగన్నాథుని ఉత్సవాలు, యాత్రలు పురాణ గ్రంథాల ఆధారిత తిథుల ప్రకారమే జరగాలన్నారు. యథేచ్ఛగా నిర్వహించడం ఎంత మాత్రం తగదని పూరీ గజపతి మహారాజా, శ్రీమందిరం పాలక మండలి అధ్యక్షుడు దివ్యసింగ్ దేవ్ సంతకం చేసిన లేఖతో 100 పేజీల భారీ నివేదికను పశ్చిమ బెంగాల్ మాయాపూర్‌లో ఇస్కాన్ అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం, ఇతర సీనియర్ సభ్యులకు పంపారు. వారి ప్రతిస్పందన కోసం వేచి ఉన్నట్లు తెలిపారు. ఇస్కాన్ సానుకూల ప్రతిస్పందన కోసం నెల రోజుల గడువు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇస్కాన్ ప్రతిస్పందన ఆధారంగా తదుపరి కార్యాచరణ ఖరారు అవుతుందన్నారు. ప్రధానంగా జగన్నాథుని స్నాన యాత్ర, రథ యాత్రని ఇస్కాన్ ప్రపంచ వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాల నిర్వహణలో శ్రీ మందిరం సంస్కృతి ఆచార వ్యవహారాలకు బాహాటంగా నీళ్లొదిలి పవిత్ర జగన్నాథ సంస్కృతిని పక్కదారి పట్టిస్తుంది. ఈ చర్య పట్ల సర్వత్రా విచారం వ్యక్తమవుతోందన్నారు. దైవిక ఆజ్ఞలకు అనుగుణంగా స్నాన యాత్ర , రథ యాత్ర సందర్భాల్లో మాత్రమే ఏటా 2 సార్లు శ్రీ మందిరం రత్న వేదికపై కొలువు దీరిన చతుర్ధా దారు మూర్తులను బయటకు తరలించడం జరుగుతుందన్నారు. గ్రంథాలు, మహర్షులు, వేద పండితుల మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన తిథుల్లో కాకుండా ఇతర అనుకూల తేదీల్లో ఇస్కాన్ ఆచారానికి విరుద్ధంగా ప్రపంచంలో పలుచోట్ల జగన్నాథ స్వామి స్నాన యాత్ర, రథ యాత్ర నిర్వహిస్తారు. ఇటువంటి చర్యలు మతపరమైన భావాలను దెబ్బ తీస్తాయని ఇస్కాన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. రథయాత్ర అనేది ఒక పవిత్ర కార్యక్రమం, దీనిని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాల కోసం ప్రదర్శన, కవాతుగా పరిగణించకూడదని తెలియజేశామన్నారు. పూరీ శ్రీ గోవర్ధన్ పీఠం అధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి గ్రంథాలు, శాస్త్రాలు నిర్దేశించిన తిథులను ప్రపంచ వ్యాప్తంగా కచ్చితంగా పాటించాలని తెలిపారు. పదే పదే అభ్యంతరాలు లేవనెత్తి లిఖిత పూర్వక లేఖల సంప్రదింపులకు ఇస్కాన్ పెడ చెవిన పెట్టి ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి సీఏఏ, కొత్తగా ఏర్పాటైన పాలక మండలి సభ్యులు, శ్రీజగన్నాథ సంస్కృతి పరిశోధకులు, పండితులు పాల్గొన్నారు.

గజపతి జిల్లాలో 17న మెగా ప్లాంటేషన్


మోహన అటవీ రేంజ్‌లో మొక్కల పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఒడిశా ప్రధాన అటవీ సంరక్షణ అధికారి సురేష్‌పంత్



మోహానాలో పాణిగండా అటవీ సెక్షన్‌లో సీడ్ బాల్స్ త్రో కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాన అటవీ సంరక్షులు సురేష్ పంత్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రెండు నియోజకవర్గాలు, ఏడు సమితి కేంద్రాలు, 149 గ్రామపంచాయతీల్లో ఈ నెల 17న మెగా ప్లాంటేషన్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి కె.నాగరాజు తెలిపారు. ఇందుకోసం ఒడిశా ప్రధాన వనసంరక్షణ అధికారి, ముఖ్య అటవీ వాహినీ అధికారి సురేష్ పంత్ గజపతి జిల్లాలో రెండు రోజులు పర్యటించారు. ఆయన మోహన, చంద్రగిరి, మహేంద్రగిరి, రాయఘడ అటవీ రేంజ్ డివిజన్లలో పర్యటించి పలు నర్సరీ మొక్కల క్షేత్రాలు, సీడ్ బాల్స్ పంపిణీను సందర్శించారు. ఆయన వెంట పర్లాకిమిడి ఏ.సి.ఎఫ్. షైనీశ్రీదాస్, వివిధ గ్రామపంచాయితీల ప్రతినిధులు ఉన్నారు.


మహేంద్రగిరి టూరిస్టు రిసార్టు వద్ద మొక్కను నాటుతున్న సురేష్ పంత్


మహేంద్రగిరి వద్ద గిరిజన మహిళలతో సురేష్ పంత్

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం: జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయ్ కుమారి, బి.విలియమ్స్ నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా పైడి రామస్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె.సంపత్ కుమార్, కోశాధికారిగా కె.చంద్రరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి ఉపాధ్యక్షుడిగా పి.కృష్ణారావులు ఎన్నికయ్యారు. సంఘం పూర్వ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా, బాల బ్రహ్మానంద, బాపూజీ, అన్నాజీరావులు కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవ్వడానికి కృషి చేశారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్ కపిల అన్నారు. నగరంలోని ఇల్లీసుపురం అంబేద్కర్ విజ్ఞానమందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవాళి మనుగడను శాసించేది పర్యావరణమేనన్నారు. ఇటీవల దేశంలో జరుగుతున్న పర్యావరణ ధ్వంసంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కనువిప్పు కావాలన్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు పంచాది రాంబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూడు రోజులుగా లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం, ఆమదాలవలస, సంతకవిటి, పొందూరు తదితర మండలాల్లో 15000 టేకు మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశామని వివరించారు. సమావేశంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి


శతక పద్యాలను వినిపిస్తున్న శంకరరావు

రాయగడ: తెలుగ భాషలోని తీయదనం, తెలుగు భాష గొప్పతనం వంటివి ప్రతీ ఇంట్లోని పిల్లలకు నేర్పి భాషాభివృద్ధికి కృషి చేయాలని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక రాజ్ భవన్‌లో రాయగడ రచయితల సంఘం (రా రా సం) నిర్వహించిన సాహితీ సదస్సు అలరించింది. అధ్యక్షుడు టి.వి.ఎస్.ఆర్.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు, కవి, రచయిత భళ్లమూడి నాగరాజు మాట్లాడుతూ.. ఒకప్పుడు రాయగడలో పంతులు శ్రీరామ శాస్త్రి వంటి రచయితలు ఉండేవారని తెలిపారు. క్రమేపీ రచయితల సంఖ్య తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీయ కవిత వినిపించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బాబూరావు మహంతి తెలుగు పదాలను సరిగ్గా ఉచ్చరించాలని అన్నారు. భళ్లమూడి వెంకట నాగేశ్వరరావు గ్రహాలు–జ్యోతిష్య శాస్త్రం వంటి విషయాలపై ప్రసంగించి చంద్రగ్రహణం గురించి వివరించారు. పి.ఎం.శంకరరావు శతక పద్యాలు ఆలపించారు. సాహితీ కార్యదర్శి మామిడి గణపతిరావు , విశ్రాంత అధ్యాపకులు ఎల్.శివకేశవరావు , సీహెచ్ చక్రధర్, వై రవికుమార్, పి రామమోహన్ రావు తదితరులు పాటలు పాడి వినిపించారు.

అభిజిత్ త్వరగా కోలుకోవాలి



ప్రఖ్యాత గాయకుడు అభిజిత్ మజుందార్ ఆరోగ్యం క్షీణించి కోమా దశలో చికిత్స పొందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలనే ఆకాంక్షాత్మక సందేశంతో సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో సైకత శిల్పం ఆవిష్కరించారు. భువనేశ్వర్/పూరీ

అధికారమే కాంగ్రెస్ లక్ష్యం

- ఏఐసీసీ ప్రతినిధి అజయ లల్లూ

జయపురం: 2029 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాష్ట్ర కాంగ్రెస్ ప్రహారి అజయ్ లల్లూ ధీమా వ్యక్తం చేశారు. అలాగే బీజేపీతో చేతులు కదుపుతున్న బీజేడీని ప్రజలు ఓడించడం ఖాయమన్నారు. శుక్రవారం సాయంత్రం జయపురం బాబాసాహేబ్ కళ్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన 'సంఘటన సృజన అభిజాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత కాంగ్రెస్ ఆదేశం మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయపురం, కోట్‌పాడ్ విధానసభల నియోజకవర్గాల పరిధిలోని జయపురం, కొట్‌పాడ్, బొరిగుమ్మ, బొయిపరిగుడ, కుంద్ర సమితిల నుంచి, కొట్‌పాడ్, జయపురం పురపాలక సంస్థల నుంచిపెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నేతలు పాల్గొన్నారు. ముందుగా ఆయన పార్టీ పరిస్థితిపై నేతల, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. ఏఐసీసీచే నియమితులైన కొరాపుట్ జిల్లా ప్రహారి భరత భూషణ్ బిమళ, ప్రసన్న దాస్‌లు జిల్లా కాంగ్రెస్ నేతలను, కార్యకర్తలను ఒక్కొక్కరినీ కలసి వారి వ్యక్తిగత అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో అజయ లల్లూ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ పతి, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శశిభూషణ పాత్రో, జిల్లా పరిషత్‌సభ్యులు, సమితి అధ్యక్షులు, మున్సిపాలిటీ, నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ అధ్యక్షులు, యువజన, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

పాలకమండలిని సస్పెండ్ చేసిన హైకోర్టు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాన్ని హైకోర్టు సస్పెండ్ చేసిందని ఆలయ వంశపారంపర్య శాశ్వత ధర్మకర్త పొట్నూరు వీరభద్రస్వామి ఆదివారం తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 12న ప్రభుత్వం స్థానిక వేంకటేశ్వరాలయానికి పాలకమండలిని నియమించిందని చెప్పారు. తనకు తెలియకుండా ఈ ప్రక్రియ చేపట్టడంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో పాలక వర్గాన్ని సస్పెండ్ చేస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

50 సెంట్ల భూమి తెమ్మని వేధించేవారు


చిట్టివలసలో విచారణ చేపడుతున్న డీఎస్పీ

ఆమదాలవలస: చిట్టివలసలో పురుగు మందు తాగి పూర్ణ అనే గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వివాహిత తల్లిదండ్రులు సింహాచలం, పద్మ మాట్లాడుతూ తమ కుమార్తె పెళ్లి సమయంలో కట్నం కింద రూ.5లక్షల నగదు, ద్విచక్ర వాహనం, రూ.2 లక్షల సారె సమకూర్చినా మరో 50 సెంట్ల భూమి తీసుకురావాలని అత్తింటి వారు నిత్యం వేధించేవారని వాపోయారు. పెళ్లయిన నాలుగు నెలలకే ఇలాంటి పరిస్థితి రావడం దారుణమన్నారు. వరకట్న వేధింపుల కారణంగా తమ కుమార్తె మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకుందని వివరించారు. విచారణలో ఎస్సై సనపల బాలరాజు, సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక.. విద్యార్థి విజ్ఞాన్ మంథన్

- స్కాలర్‌షిప్ పరీక్షకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు అర్హులు
- ఎంపికైన వారికి నెలకు రూ.2000 చొప్పున ప్రోత్సాహకం
- సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తులకు గడువు

శ్రీకాకుళం: విద్యార్థి విజ్ఞాన్ మంథన్.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించే ప్రతిభా పరీక్ష. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు చదివే విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. ఇందులో ప్రతిభ కనబరిస్తే డీఆర్‌డీఓ, ఇస్రో, బీఏఆర్‌సీ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం లభిస్తుంది. దీనికి అదనంగా ప్రతినెలా రూ.2000 చొప్పున ఏటా రూ.24 వేలను ప్రోత్సాహకంగా అందిస్తారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో పరీక్ష రాసే సౌలభ్యం ఉంది. పాఠశాల స్థాయిలో ఎంపికైతే రాష్ట్రస్థాయికి తరగతుల వారీగా 150 మందిని ఎంపిక చేసి పంపిస్తారు. అక్కడ ప్రతిభ చూపిన వారికి ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిజాతీయస్థాయిలో జరిగే పరీక్షలకు పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచేవారికి రూ.5000, రూ.2000, రూ.1000, సర్టిఫికెట్లను అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి రూ.25 వేల నగదు బహుమతి ఏడాది పాటు ఉపకార వేతనం అందజేస్తారు. జాతీయస్థాయిలో ఎంపికై న విద్యార్థులకు 20 రోజులు పాటు పేరొందిన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 28 నుంచి 30 మధ్య ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

సెల్‌ఫోన్‌లో... రుణ రక్కసి..!



చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ఎటువంటి ష్యూరిటీ లేకుండానే క్షణాల్లో రుణం పొందవచ్చని ఆశ చూపుతారు. యాప్ డౌన్‌లోడ్ చేసి క్లిక్ చేస్తే ఇక అంతే సంగతులు. చేతికొచ్చే నగదు ఖర్చు చేసేలోపే యాప్ నిర్వాహకుల నుంచి ఫోన్ల మోత మొదలవుతుంది. వడ్డీ కట్టాలని వేధిస్తూ బూతులతో రెచ్చిపోతారు. కడతామని చెప్పినా.. వాళ్ల కర్కశం ఆగదు. మనకు తెలియకుండా డేటా చోరీ చేసి ఫేక్ నగ్న ఫొటోలను కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లకు పంపే దుశ్చర్యకు పాల్పడతారు. ఇలా ఉక్కిరిబిక్కిరి చేసి మన పరువు తీసే వ్యూహానికి ఒడిగడతారు. వారి ఆగడాలకు బలైపోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. అందుకే రుణ రక్కసి వలలో చిక్కకుండా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

- లోన్ పేరుతో యువతకు యాప్‌ల వల
- ష్యూరిటీ లేకుండానే అప్పులు
- ఆపై అధిక వడ్డీల కోసం వేధింపులు
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

హిరమండలం: పెరుగుతున్న టెక్నాలజీని కొందరు కేటుగాళ్లు ఉపయోగించుకుంటూ అమాయకులకు గాలం వేస్తున్నారు. ష్యూరిటీ లేకుండానే రుణం అని చెప్పి ఆకర్షిస్తున్నారు. అలా ప్రైవేటు యాప్‌ల ద్వారా రుణం తీసుకున్న తర్వాత అసలు కథ మొదలవుతుంది. తీసుకున్న నగదు కంటే వడ్డీకి వడ్డీ వేసి అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ఫేక్ నగ్న వీడియోలు వైరల్ చేస్తామని బ్లాక్ మెయిల్‌కు దిగుతారు. వారి టార్చర్ తట్టుకోలేక కొందరు లోలోపలే కుంగిపోతుంటే.. మరికొంతమంది ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. అందువలన ప్రైవేటు యాప్స్‌లో రుణాలు తీసుకుని మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అనేకమంది బాధితులు

మీ సెల్‌ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ రుణయాప్ నిర్వహకులు ఇచ్చే ప్రకటనలతో కొందరు వెంటనే డౌన్‌లోడ్ చేసేస్తున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్ వలలో చిక్కితే బయటపడడం అసాధ్యం. ఇలా యాప్‌ల బారిన పడినవారు జిల్లాలో అనేక మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. లోన్‌యాప్స్ నిర్వాహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు. మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునే వరకు ఫోన్ చేసి, ఏదోవిధంగా ఒప్పించి రుణం తీసుకునేలా చేస్తారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే చుక్కలు చూపిస్తున్నారు.

హిరమండలానికి చెందిన ఒక వ్యాపారి కుమారుడు లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. అయితే అతను సక్రమంగా చెల్లించకపోవడంతో యాప్ నిర్వహకులు గ్రామంలోని ఒకరికి ఫోన్‌చేసి మీరు ష్యూరిటీ పెట్టారు కదా చెల్లించండని వేధించారు. విసిగిపోయిన ఆయన మీ మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.. అని గట్టిగా చెప్పడంతో అప్పటినుంచి ఫోన్ కాల్స్ రావడం లేదు. ఇలాంటి బాధితులు గ్రామాల్లో ఎంతోమంది ఉన్నారు. బయటకు చెప్పకోలేక కుమిలిపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లవద్దు. అదేవిధంగా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని అడిగినా చెప్పవద్దు. ప్రతీ యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణయాప్‌లో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లోన్‌యాప్ నిర్వాహకుల నుంచి ఎటువంటి వేధింపులు వచ్చినా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సీహెచ్ ప్రసాద్, సీఐ, కొత్తూరు

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మొబైల్‌కు పరువు, ప్రతిష్ఠకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపుతారు. బెదిరింపులను లెక్క చేయకపోతే రుణం తీసుకున్నవారి కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సప్‌కు పంపుతారు. వీరి ఆగడాలు కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపైనే కన్నేశారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరాజు

రామభద్రపురం: మండలకేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలో చిన్నమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన మామిడిపాక వెంకటరాజు సొంత పనినిమిత్తం ద్విచక్రవాహనంపై బొబ్బిలి వెళ్లి పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా చిన్నమ్మతల్లి ఆలయం వద్దకు వచ్చే సరికి విశాఖ జిల్లా పరవాడ నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి వెళ్తూ ఎదురుగా ద్విచక్రవాహనదారు అక్కడున్న గోతులను తప్పించబోయి వెంకటరాజు బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. దీంతో వెంకటరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు స్థానిక క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తండ్రి శంకరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగు పూరిళ్లు దగ్ధం



ప్రమాద స్థలంలో ఆస్తినష్టాన్ని అంచనా వేస్తున్న రెవెన్యూ అధికారులు

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామంలో విద్యుత్ షార్టుసర్క్యూట్ కారణంగా నాలుగు పూరిళ్లు ఆదివారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాత వీధిలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో వడిసిల దముడమ్మ ఇంటి వద్ద విద్యుత్ షార్టుసర్క్యూట్ జరగడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి.దీంతో వడిసిల లక్ష్మి, సమ్మంగి సోములు, వడిశిల అప్పలస్వామి, సమ్మంగి సూరమ్మ ఇళ్లకు మంటలు వ్యాపించి క్షణాల్లో కాలిపోయాయి.ఈ ప్రమాదంలో బాధితులకు సంబంధించి బట్టలు, వంట సామాగ్రి, తిండి గింజలు,విద్యుత్ మీటర్లు, టీవీలు దగ్ధమయ్యాయి. ఎస్.కోట నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు వీఆర్‌ఓతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్‌ఐ తెలిపారు.

30 మేకల మృత్యువాత

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో పిడుగుపడడంతో గ్రామానికి చెందిన 30 మేకలు మృత్యువాత పడ్డాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గలారి పదసాహెబ్, సార ఎర్రయ్యమ్మ, సారా బుచ్చమ్మ, గలారీ కేకులుకు సంబంధించిన 30 మేకలు చనిపోయాయి. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.కొండపై వర్షం వస్తున్నందున మేకలన్నీ ఒకే చెట్టు కిందకు చేరుకోవడం అప్పుడే పిడుగు పడడంతో మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం స్పందించి గిరిజన బాధితులకు నష్టపరిహారం అందించాలని జిల్లా రైతు సంఘం నాయకుడు చల్లాజగన్ కోరుతున్నారు.

రాజాంలో సినీ దర్శకుడు నారాయణమూర్తి సందడి


వైఎస్సార్‌సీపీ నేతలతో నటుడు నారాయణమూర్తి

రాజాం: సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి రాజాంలో సందడి చేశారు. ఆదివారం పట్టణంలోని పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, సంఘాల ప్రతినిధులు, ప్రజా హక్కుల పోరాట సంఘాల ప్రతినిధులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులును, అధికారులను కలిశారు. ఇటీవల తాను నిర్మించిన కొత్త సినిమా విడుదలైందని, ప్రమోషన్‌లో భాగంగా అన్ని ప్రాంతాల్లో తిరిగి, పలువురికి సినిమా విశేషాలు తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాజాంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావుతో పాటు నాయకులను కలిశారు. అంతకుముందు రాజాంలో నివాసముంటున్న ఐఏఎస్ అధికారి, ఏపీ పీఐబీ డైరెక్టర్ గేదెల సురేష్‌కుమార్‌తో పాటు ఆయన కుటుంబాన్ని కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్.నారాయణమూర్తితో సెల్ఫీలు దిగారు.

కల్వర్టుల నిర్మాణం కలేనా?


జిల్లా కేంద్రం ప్రారంభంలో డైవర్షన్ పనుల దశలో నిలిచిపోయిన అంతర్‌రాష్ట్ర రహదారిపై కల్వర్టు


శిథిలావస్థకు చేరిన లక్ష్మీనారాయణపురం సమీపంలో కల్వర్టు




గుంతలతో అధ్వానంగా పులిగుమ్మి రహదారి

- జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన 44 కల్వర్టులు
- రెండింటికి మాత్రమే మంజూరైన నిధులు

పార్వతీపురం రూరల్: రహదారులపై అధ్వానంగా భారీ గుంతలు ఏర్పడి వాహన చోదకులను ప్రమాదాలకు గురిచేస్తుంటే ఇంకోపక్క రహదారిపై ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరి, కుంగిపోయి మరింత భయాందోళనకు వాహనచోదకులను గురిచేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రహదారులపై 44 కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్మాణాల నిమిత్తం ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు, అంచనా విలువలు అధికారులు పంపించారు. అయితే ప్రస్తుతం రెండు కల్వర్టులకు సంబంధించి మాత్రమే నిధులు మాత్రమే మంజూరయ్యాయని, మరో 133 కల్వర్టులకు మరమ్మతులు చేసేందుకు కూడా నివేదికలు పంపామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రహదారులు దారుణంగా గోతులమయమై వాహనాల రాకపోకలకు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రహదారుల్లో కనీస స్థాయిలో మరమ్మతులు సైతం సక్రమంగా నిర్వహించడం లేదు. జిల్లా కేంద్రం నుంచి కొరాపుట్‌కు వెళ్లేందుకు ఉన్న రహదారిపై మరమ్మతులు ప్రారంభించి కొన్ని భారీ గుంతలు మాత్రమే పూడ్చి పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రహదారిపై అక్కడక్కడ ఏర్పడిన గుంతల్లో రాళ్లు తేలి మరమ్మతులకు నోచుకోకపోవడంతో సమస్యకు పూర్తి పరిష్కారం కాలేదని వాహన చోదకులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణం ఎప్పుడో?

రహదారి నిర్మాణం, మరమ్మతులకు సంబంధించిన 97పనులకు నిధులు మంజూరు కాగా 324 కిలోమీటర్ల రహదారి పనులను ప్రారంభించి 295 కిలోమీటర్లు పనులు పూర్తిచేశామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికీ దారుణమైన గుంతలతో రహదారులు దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 324 కిలోమీటర్ల పరిధిలో పనులు చేశామని ఆర్‌అండ్‌బీ పరిధిలో మరో 150 కిలోమీటర్ల రోడ్ల పనులకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇంకా చాలా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన రహదారుల పనులపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో స్పష్టత ఇవ్వడం లేదు. అంచనాలు వేస్తున్నామంటూ దాటవేస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో బైపాస్‌రోడ్డు, పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి, లక్ష్మీనారాయణపురం, సంగంవలస, సీతంపేట తదితర గ్రామాల రోడ్లు గుంతలతో నేటికీ అధ్వానంగా ఉన్నాయి. మరి ఈ రోడ్డు పనులు ఎప్పుడు నిర్వహిస్తారో? ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదెప్పుడో? అర్థం కాని పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు రోజూ కళ్లారా చూస్తూ దారుణమైన పరిస్థితుల్లో ఉన్న రహదారులపై ముఖం చాటేస్తూ దాటేస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాన్య వాహన చోదకులు అధికారులు, పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నివేదికలు సిద్ధం చేస్తున్నాం

ఆర్‌అండ్‌బీ పరిధిలో గత అక్టోబర్‌లో మంజూరైన నిధుల మేరకు 324 కిలోమీటర్ల రహదారి పనులు ప్రారంభించి 295 కిలోమీటర్ల పనులు పూర్తి చేశాం. అలాగే కల్వర్టులకు సంబంధించి 44చోట్ల పునర్నిర్మాణాల కోసం, 133 కల్వర్టుల మరమ్మతులకు సంబంధించి అంచనాలతో కూడిన నివేదికలను పంపించాం. అయితే రెండు కల్వర్టుల పునర్నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. మిగతా వాటికి మంజూరు కావాల్సి ఉంది. రహదారులపై అవసరమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నాం.

రాధాకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
పార్వతీపురం, మన్యం జిల్లా

వీఓఏలకు కాలపరిమితి రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీవోఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

పార్వతీపురం టౌన్: వెలుగు వీవోఏ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కిల్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని వీవోఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో వీవోఏల జిల్లా మహాసభ కె.కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవోఏల 3 సంవత్సరాల కాల పరిమితి సర్కిల్ రద్దు చేయాలని కోరారు. మెప్మాలో ఈ సర్క్యులర్‌ను రద్దు చేశారు అదే రకంగా వెలుగు సెర్ప్‌లో కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రకరకాల పనులు ఇవ్వడం ద్వారా ఐకేపీ వీవోఏ పని భారం పెరుగుతోందన్నారు. పలు యాప్‌లు లాగిన్ చేయడం ద్వారా వీవోఏలు అనారోగ్యం పాలవుతున్నారని, రాజకీయంగా వేధిస్తూ జిల్లాలో 19 మంది వీవోఏలను తొలగించడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. ఇస్తున్న వేతనాలు ఆరు, మూడు నెలలకు ఒకసారి చెల్లించడం దారుణమైన విషయమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగింపులు, వేధింపుల నుంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా వీవోఏలు ఐక్యమై ఉద్యమించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లాలోని 15 మండలాల నుంచి హాజరైన వీవోఏల సంఘం నూతన జిల్లా అధ్యక్షురాలిగా కె. శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కె.ధర్మరాజు, కోశాధికారిగా కె.కుమారి. సహ కార్యదర్శులుగా సుందరరావు, దేవి, ఉపాధ్యక్షుడిగా డి.అరుణ విజయ్ కుమార్‌లను మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి రామలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమవ్వాలి


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఈ నెల 13న జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత పోలీసు సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో ఇరు వర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్, రోడ్డు ప్రమాద కేసులు, ఇతర కాంపౌండ్ కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలతో సంప్రదించి, సమావేశాలు నిర్వహించి, వారు రాజీ అయ్యే విధంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఇందుకుగాను పోలీసు స్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. లోక్ అదాలత్ విజయవంతమయ్యేందుకు సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కోరారు. కేసుల్లోని ఇరు వర్గాలపై ఒత్తిడి లేకుండా, సహకారాత్మక వాతావరణంలో రాజీ అయ్యేలా వారిని ప్రోత్సహించాలన్నారు. సమన్వయంతో పని చేస్తే త్వరగా కేసులు సానుకూలంగా రాజీ అయ్యే అవకాశాలు పెరుగుతాయన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను ప్రతిరోజూ ఆయా సబ్ డివిజన్‌లకు చెందిన డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

గణనాథుడి ఊరేగింపులో ఘర్షణ

- ఇరువర్గాల మధ్య వివాదం
- భారీగా మోహరించిన పోలీసులు
- గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్


సతివాడలో పహారా కాస్తున్న పోలీసులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో శనివారం అర్ధరాత్రి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. గణనాథుడి ఊరేగింపు కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్సీ కాలనీ ప్రజలు గణేష్ నిమజ్జన కార్యక్రమానికి శనివారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఊరేగింపులో భాగంగా గ్రామ ప్రధాన రహదారి నుంచి వెళ్లేందుకు యత్నించగా బీసీ వర్గాలు అడ్డుకున్నాయి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువత తమ పట్ల, తమ ఆడబిడ్డల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ బీసీ వర్గానికి చెందిన మహిళలు అర్ధరాత్రి రోడ్డుపై బైఠాయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఇళ్ల ముందు నుంచి ఊరేగింపు చేయడానికి వీలులేదంటూ అడ్డుకున్నారు. ఈ సమాచారం పోలీసులకు చేరడంతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ..సుమారు 20 మంది సిబ్బందితో గ్రామానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తగాదా పెరగకుండా నిలిచిపోయిన గణేష్ నిమజ్జనాన్ని పోలీసులే చేపట్టారు. ఇదిలా ఉండగా దళితులమనే అక్కసుతోనే తమ గణనాథుడి నిమజ్జనానికి అడ్డు తగిలారంటూ ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు చెబుతున్నారు. వివక్ష చూపిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సీఐ రామకృష్ణను వివరణ కోరగా ఘటన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన సుమారు 30 మందిపై చర్యలు తీసుకోవాలని దళిత వర్గానికి చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారని వారి ఫిర్యాదును పరిశీలిస్తున్నామని చెప్పారు.

చెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


చెస్ అసోసియేషన్ నూతనకార్యవర్గం

విజయనగరం టౌన్: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కేకే జగన్నాథ్, ఉపాధ్యక్షులుగా సాగి జానకీరామ్‌రాజు, డాక్టర్ పైల రమేష్ కుమార్, కార్యదర్శిగా కరణం భాస్కరరావు, సహ కార్యదర్శులుగా కాళ్ల లీలా ప్రసాదరావు, సంభాన శ్రీధర్, కోశాధికారిగా బైరెడ్డి సన్యాసినాయుడు, మెంబర్లుగా జి.లక్ష్మీ గాయత్రి దేవి, ఎల్.రమ, డి.రమేష్, ఎస్.పద్మావతి, ఎంజేవీఎస్ఎన్.తాడిరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిటర్నింగ్ అధికారిగా ఎం.పీటర్ మార్టిన్ వ్యవహరించి కొత్త కార్యవర్గసభ్యులను ఎంపిక చేశారు. ఎంపికైన సభ్యులందరినీ అసోసియేషన్ అభినందించింది.

పోలీసుల అదుపులో 13 మంది జూదరులు

సీతానగరం: మండలంలోని జయంతిరాయపురం - గాదెలవలస గ్రామాలమధ్య తోటపల్లి కాలువ గట్టుపై ఆదివారం సాయంత్రం పేకాట స్థావరాలపై ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కాలువ గట్టుపై జయంతిరాపురం- గాదెలవలస గ్రామాల మధ్య పేకాట ఆడుతున్నారని గుర్తించి దాడులు చేసి 13 మంది జూదరులతో పాటు రూ 18,020లు సీజ్ చేశారు. దీనిపై ఎస్ ఎంరాజేష్ మాట్లాడుతూ నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


బుగత లక్ష్మణ్ (ఫైల్)

భోగాపురం: మండలంలోని సవరవిల్లి పంచాయతీ బుగతపేట గ్రామానికి చెందిన బుగత లక్ష్మణ్(42) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుగతపేట గ్రామానికి చెందిన బుగత లక్ష్మణ్ కొబ్బరి తోటల్లో కొబ్బరి కాయలు తీసుకుంటూ వచ్చిన డబ్బులతో కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆ బాధను తట్టుకోలేక ఇంట్లో కేకలు వేయడం మొదలుపెట్టాడు. దీంతో అతనికి ఏదో గాలి పట్టిందని అందువల్లే ఇలా ప్రవర్తిస్తున్నాడని కుటుంబసభ్యులు భావించారు. ఈ క్రమంలో లక్ష్మణ్ బహిర్భూమికి వెళ్తానని చెప్పి శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బయటకు వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం రాజ్‌కమల్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న చెరువులో లక్ష్మణ్ శవమై తేలాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తమ్ముడు యరకయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సూర్యకుమారి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రైలు ఢీ కొని మరో వ్యక్తి..

సీతానగరం: మండలంలో విశాఖ-రాయగడ రైల్వే లైన్‌లో సీతానగరం మండలం మరిపివలస వద్ద గేటు దాటుతుండగా ఆదివారం సాయంత్రం రైలు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై పార్వతీపురం రైల్వే పోలీస్ రత్నకుమార్ తెలిపిన వివరాలిల మేరకు ట్రైన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల గ్రామాలకు తెలియజేయగా మృతుడిని మండలంలోని నిడగల్లు గ్రామానికి చెందిన పప్పల సూర్యనారాయణ(58)గా గుర్తించారన్నారు. మృతదేహాన్ని పార్వతీపురం ప్రభుత్వ జిల్లాకేంద్రాస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు


సాధించిన పతకాలతో సెంచూరియన్ విద్యార్థినులు శ్రీపాద శ్రీజ, మౌనిక

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్ వేదికగా ఆదివారం జరిగిన ఖేలో ఇండియా అస్మిత వెయిట్ లిఫ్టింగ్ లీగ్ పోటీల్లో శ్రీపాద శ్రీజ ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు, మరో విద్యార్థిని మౌనిక రెండు స్వర్ణపతకాలు దక్కించుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎస్ రావు, చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, వైస్ చాన్సలర్ పీకే మహంతి, తదితరులు అభినందిచారు.

55 మద్యం సీసాల పట్టివేత


పట్టుకున్న మద్యం సీసాలు చూపుతున్న అధికారులు

రాజాం: రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్‌శాఖ రాజాం సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో మూడురోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆరుగురు వ్యాపారులపై కేసులు నమోదుచేసి 55 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామని చెప్పారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

‘భౌ’బోయ్ కుక్కలు


భోగాపురం రహదారిపై గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

భోగాపురం: మండల కేంద్రంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు..జనాలను భయపెట్టిస్తున్నాయి. కొన్నిచోట్ల గుంపులుగుంపులుగా తిరిగే వీధికుక్కలు దారిన పోయే వారిపై ఎగబడి కరుస్తున్నాయి. వాహనాలపై వచ్చినా తమపై ఎగిరిపడిపోతున్నాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్తమ టీచర్ అవార్డుల ఎంపికలో అక్రమాలు

- విచారణకు ఉపాధ్యాయ వర్గాల డిమాండ్

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ కుదిర్చిన నిబంధనలను, అర్హత ప్రమాణాలను పక్కన బెట్టి అనర్హులైన కొంతమంది ఉపాధ్యాయులను ఎంపిక చేయడమే కాకుండా కలెక్టర్ ఆమోదించిన ఫైనల్ లిస్టులో లేని పేర్లను కూడా అదనంగా చేర్చి సన్మానించడం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఒక ఉపాధ్యాయుడికి సస్పెన్షన్, అనుచిత ప్రవర్తన కేసు కోర్టులో పెండింగ్ వంటి అనర్హతలు ఉన్నప్పటికీ అలాంటి ఉపాధ్యాయుడిని ఈ ఏడాది ఎంపిక చేయడం వివాదాస్పదమైంది. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు పొందిన గుర్ల మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడికి, ఇప్పటికే అవార్డులు పొందిన ఎస్.కోట మండలానికి చెందిన మరో ఉపాధ్యాయుడికి కూడా ఈ ఏడాది మరోసారి ఇవ్వడం వల్ల అర్హులైన ఇంకో ఉపాధ్యాయుడికి అవార్డు కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన అవార్డుల ఎంపికలో జరిగిన ఈ అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి వచ్చినా మధ్యాహ్న భోజనాలు పెట్టకపోవడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చిన అవార్డు ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారని వాపోయారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- వాచ్‌మన్ మృతిపై కుటుంబసభ్యుల ఆందోళన


కోడూరు ముత్యాల నాయుడు (ఫైల్)


మృతదేహంతో మిల్లు వద్ద నిరసన తెలుపుతున్న మృతుని కుటుంబీకులు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పాలకొండ రోడ్డులోని లక్ష్మీనారాయణ ఆగ్రో ఇండస్ట్రీ రైస్ మిల్లులో పనిచేస్తున్న వాచమన్ కోడూరు ముత్యాలనాయుడు (70) ఈ నెల 6న మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు మిల్లు యాజమాన్యంతోపాటు పోలీసుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే వాచ్‌మన్ మృతిచెందాడంటూ పెద్ద ఎత్తున ఆదివారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. పొనుగుటివలస గ్రామానికి చెందిన కోడూరు ముత్యాలునాయుడు ఏడాది నుంచి రైస్‌మిల్లులో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 14న రాత్రి యథావిధిగా విధులకు హాజరయ్యాడు. ఆ రోజు రాత్రి మిల్లు వద్ద ఊక కోసం రెండు లారీలు వచ్చాయి. లారీలో వచ్చిన కొంతమందిని అక్కడ మద్యం తాగవద్దని వాచ్‌మన్ అడ్డుకోగా దాడికి దిగారు. దీంతో వాచ్‌మన్ ముఖంతోపాటు పలుచోట్ల తీవ్రగాయాలయ్యాయి. మరుసటి రోజు విషయం తెలుసుకున్న కుమారుడు లక్ష్మనాయుడు తండ్రిని ఆస్పత్రిలో చేర్పించడంతో పాటు సంతకవిటి పోలీసులకు, మిల్లర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వూండ్ సర్టిఫికెట్‌లేదని కేసు కట్టలేమని ఎస్సై గోపాలరావు తెలిపారని బాధితులు వాపోయారు. మరోవైపు రూ.15వేలు, రూ.25వేలు ఇప్పిస్తామని ఎస్సై రాజీ ప్రయత్నాలు చేసినట్లు ఫిర్యాదులో బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన

ముత్యాలనాయుడు మృతిని జీర్ణించుకోలేక అటు కుటుంబసభ్యులతో బంధువులు మృతదేహాన్ని తీసుకొచ్చి మిల్లు ఎదుట నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న రాజాం రూరల్ సీఐ ఉపేంద్రతోపాటు రేగిడి, వంగర, సంతకవిటి ఎస్సైలు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనను అదుపుచేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. మృతుని కుమారుడి ఫిర్యాదుతో హత్యకేసుగా నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని సీఐ ఉపేంద్ర వెల్లడించారు.

గర్భం దాల్చిన బాలిక

- చికిత్స పొందుతూ మృతి

చీపురుపల్లి: కష్టపడి చదివి ప్రయోజకులవుతారనుకుని ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు తల్లిదండ్రులు పంపిస్తుంటే చదువు పక్కన పెట్టి ప్రేమాయణం సాగిస్తున్న పరిస్థితులు దాపురిస్తున్నాయి. కనీసం 18 సంవత్సరాలు కూడా నిండని వారు తొమ్మిదో తరగతి నుంచి ప్రేమలో పడి, ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ ఒకడుగు ముందుకేశారు. అది కాస్త బాలిక గర్భం దాల్చడానికి దారి తీసింది. బాలిక తెలిసో తెలియకో గర్భవతి కావడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. చదువుకుని ప్రయోజకురాలై కుటుంబాన్ని చూసుకుంటుందని అనుకున్న కుమార్తె ఇలా అర్థాంతరంగా మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. కొద్ది రోజుల క్రితం బాలికకు ఫిట్స్ రావడంతో స్పృహ కోల్పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి విజయనగరం ఘోషా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలిక ఐదు నెలలు గర్భవతిగా నిర్ధారించారు. అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో బాలిక అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

జరిగింది ఇదే..

చీపురుపల్లి పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలికను గరివిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు ప్రేమించి గర్భవతిని చేశాడు. మైనర్లు ఇద్దరూ ఆరో తరగతి నుంచి ఒకే పాఠశాలలో చదువుతుండగా, తొమ్మిదో తరగతి నుంచి ప్రేమాయణం సాగిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. దీనిపై పోలీసులు ఇప్పటికే పోక్సో కేసు నమోదు చేశారు.